# సుప్రీం కోర్టు ఆదేశించిన నియమావళి

# పోలీసులు అరెస్టు చేస్తే ఇవీ మన హక్కులు

ప్రజలారా!

మనం చేసిన తప్పుకయినా, చేయని తప్పుకయినా లాకప్పు పాలయ్యే ప్రమాదం మనకందరికీ ఉంది. అందువల్ల అరెస్టు చేసేటప్పుడు, ఇంటరాగేషన్ చేసేటప్పుడు పోలీసులు పాటించవలసిన నియమాలను తెలుసుకోవలసిన అవసరం మనకందరికీ ఉంది. చట్టంలో ఇప్పటికే రెండు నియమాలు స్పష్టంగా ఉన్నాయి. (1) ఇంటరాగేషన్ చేసే సమయంలో పోలీసులు సమాచారం రాబట్టడానికి ఎవ్వరినీ ఎటువంటి హింసకూ గురి చేయడానికి వీలులేదు. శారీరక హింసకే కాదు. మానసిక హింసకుకూడ. కస్టడీలోకి తీసుకున్న వ్యక్తిని 24 గంటలలోపల కోర్టులో హాజరు పెట్టాలి. ఇవి రాజ్యాంగ ప్రాధమిక హక్కులు. (2) అరెస్టు చేసేటప్పుడు మనం ప్రతిఘటించకపోతే మనపైన ఎటువంటి బలప్రయోగం చేసే అధికారం పోలీసులకు లేదు. ప్రతిఘటించినప్పుడు కూడా, **కేవలం ఆ ప్రతిఘటనను అధిగమించి** మనల్ని అదుపులోకి తీసుకోవడానికి అవసరమైన కనీస బలప్రయోగాన్ని మాత్రమే చట్టం పోలీసులకు అనుమతిస్తుంది.

ఈ నియమాలు చట్టంలో స్పష్టంగానే ఉన్నప్పటికీ, పోలీసులు అరెస్టు చేసే సమయంలో చాలా విచ్చలవిడిగా ప్రవర్తించడం మామూలయిపోయింది. విపరీతమైన బలప్రయోగం చేయడం పరిపాటి అయిపోయింది. ఇంటరాగేషన్ పేరిట అమానుషమైన చిత్రహింసలు పెట్టడం పరిపాటి అయిపోయింది.

దీనిని అదుపు చేసే ఉద్దేశ్యంతో భారత సుప్రీం కోర్టు గత సంవత్సరం జనవరిలో 11 సూత్రాల నియమావళిని జారీ చేసింది. (డి.కె. బసు వర్సెస్ స్టేట్ ఆఫ్ వెస్ట్ బెంగాల్, డబ్ల్యు.పి.నెం. 539/1986). ఈ నియమావళి చట్టంతో సమానం. దానిని పోలీసులు తప్పనిసరిగా ఆచరించాలి. ఆచరింపజేసుకోవడం మన హక్కు. ప్రజలు వాటిని తెలుసుకొని పోలీసులు తమను గాని తమవారిని గానీ అరెస్టు చేసినప్పుడు నిలదీసి అమలు చేయించుకోవాలనే ఉద్దేశ్యంతో ఆ 11 సూత్రాలను దిగువ వివరిస్తున్నాము.

1. అరెస్టు చేసే పోలీసులు తమ పేరు, హోదా సూచించే స్పష్టమైన బ్యాడ్జిలు లేక గుర్తులు ధరించాలి. నిర్బంధంలో ఉన్న ముద్దాయిలను ప్రశ్నించే (ఇంటరాగేట్ చేసే) పోలీసులు కూడ తమపేరు, హోదా సూచించే స్పష్టమైన బ్యాడ్జిలు లేక గుర్తులు ధరించాలి. ఒక ముద్దాయిని ప్రశ్నించడంలో పాల్గొన్న సిబ్బంది పేర్లు ఒక రిజిస్టర్‌లో రాసి ఉంచాలి.

   (అంటే అర్థం, మనల్ని అరెస్టు చేస్తున్నది పోలీసులో గుండాలో అర్థం కాని పద్ధతిలో బ్యాడ్జిలు లేకుండ ఎటువంటి అధికార చిహ్నాలు లేకుండ రౌడీలలాగ మీదపడి పట్టుకు పోవడానికి లాకప్పులో ప్రశ్నించడానికీ వీలు లేదని.)

2. అరెస్టు చేసే పోలీస్ అధికారి అప్పటికప్పుడే ఒక కాగితం మీద తాను ఎవరిని అరెస్టు చేస్తున్నది, ఎక్కడ, ఏరోజు, ఏటైంకు చేస్తున్నదీ తెలియచేసే 'మెమో' తయారు చేయాలి. దానిపైన ఒక సాక్షి సంతకం తీసుకోవాలి. ఆసాక్షి బంధించబడిన వ్యక్తి (బందీ) కుటుంబ సభ్యులలో ఒకరు కావచ్చు, లేదా ఆ ప్రాంతంలో నివసించే ఒక గౌరవనీయులైన వ్యక్తి కావచ్చు. ఆ అరెస్టు మెమో పైన బందీ సంతకం కూడ తీసుకోవాలి.

   (అంతే తప్ప బందిలదొడ్లోకి పశువును గుంజుకుపోయినట్టు మాటామంతీ లేకుండా, ఏ సాక్ష్యాధారం లేకుండ గుంజుకు పోవడానికి వీలులేదు.)

3. పైన పేర్కొన్న అరెస్టు మెమో పైన సాక్షి సంతకం చేసినది బందీ కుటుంబ సభ్యులలో లేక శ్రేయోభిలాషులయిన మిత్రులలో ఒకరు కాని పక్షంలో, బందీని లాకప్పులో లేక ఇతర ఇంటరాగేషన్ సెంటర్‌లో పెట్టిన వెంటనే (ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా) బందీ కుటుంబ సభ్యులకు లేక శ్రేయోభిలాషులయిన మిత్రులకు అరెస్టు విషయం తెలియజేయాలి. బందీని ఎక్కడ నిర్బంధించినదీ తెలియజేయాలి.

   (కాబట్టి, స్థానిక నివాసి అయిన గౌరవనీయులయిన వ్యక్తి సంతకం తీసుకున్నామని చెప్పి, పోలీసులకు మిత్రుడయిన ఏ రౌడీ సంతకమో అరెస్టు 'మెమో' పైన తీసుకొని, బందీ కుటుంబానికి ఏమీ తెలియకుండ దాచిపెట్టడానికి వీలులేదు).

4. ఒక వేళ బందీ కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆ ఊరి వెలుపల లేక ఆ జిల్లా వెలుపల ఉన్నట్టయితే, పై వివరాలను ఆ జిల్లా న్యాయ సహాయ కేంద్రం ద్వారానూ సంబంధిత పోలీస్ స్టేషన్ ద్వారానూ వారికి అరెస్టు చేసిన 8 లేక 12 గంటల లోపల టెలిగ్రాం రూపకంగా తెలియజేయాలి.

   (కాబట్టి, బంధువులెవరూ ఈ దరిదాపులలో లేరు కాబట్టి మేము ఎవరికీ తెలియజేయలేకపోయాం అని దబాయించడానికి వీలు లేదు.)

5. తన అరెస్టు విషయం తన వారికి పోలసులు తెలియజేసి తీరాలనే హక్కు తనకుందన్న విషయాన్ని అరెస్టు చేసిన వెంటనే పోలీసులు బందీకి తెలియజెప్పాలి.

(అంటే అర్థం, నీ హక్కులు నీకు తెలియకపోతే మేమేం చేయగలం అనడానికి వీలులేదు. బందీకి తన హక్కులేమిటో తెలియజేయాలి. యాభై శాతం నిరక్షరాస్యులైన ఈ దేశంలో అటువంటి నియమం అవసరం.)

6. అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు (లేక ఇతర నిర్బంధ కేంద్రానికి) తీసుకురాగానే అక్కడ డైరీలో బందీపేరు, అరెస్టు చేసిన పోలీస్ అధికార్ల పేర్లు, ఎవరి కస్టడీలో ఉంచుతున్నారో ఆ అధికార్ల పేర్లు, అరెస్టు విషయం తెలియజేసిన కుటుంబసభ్యులు లేక మిత్రుల పేర్లు నమోదు చేయాలి.

7. బందీ ఒకవేళ కోరుకున్నట్టయితే, తన శరీరం మీద ఉన్న చిన్న పెద్ద గాయాల వివరాలను అరెస్టు చేసిన సమయంలో పరీక్షించాలి. వాటిని కాగితం పైన ('ఇన్‌స్పెక్షన్ మెమో') నమోదు చేయాలి. దానిపైన అరెస్టు చేసిన పోలీస్ అధికారి సంతకం, బందీ సంతకం తీసుకోవాలి. ఈ ఇన్‌స్పెక్షన్ మెమో నకలు ఒకటి బందీకి ఇవ్వాలి.

(అంటే ఆ తరువాత లాకప్పులో కొట్టిన దెబ్బలన్నీ అంతకు ముందే ఎవరో కొట్టిన దెబ్బలు అనీ, అరెస్టు చేసినప్పుడే బందీ ఒంటిపైన ఆ దెబ్బలు ఉన్నాయనీ బుకాయించడానికి అవకాశం ఉండకూడదు)

8. అరెస్టయిన వ్యక్తిని నిర్బంధంలో ఉన్నంతకాలం ప్రతీ 48 గంటలకొకసారి వైద్యునిచేత పరీక్ష చేయించాలి. రాష్ట్ర వైద్యశాఖ డైరెక్టర్ ఆమోదించిన వైద్యుని చేత చేయించాలి. అన్ని రాష్ట్రాల వైద్యశాఖ డైరెక్టర్‌లు ప్రతీ జిల్లాలోనూ ప్రతీ తాలూకాలోనూ ఆమోదిత వైద్యుల జాబితాను ప్రకటించాలి.

(పోలీసు కస్టడీలో 24 గంటలపైన (కోర్టు అనుమతి లేకుండా) ఎవరినీ ఉంచుకోవడానికి వీలు లేదు కాబట్టి దీని అర్థం ఏమిటంటే, మొదట అరెస్టయిన క్షణం నుండి తిరిగి స్వేచ్ఛపొందే దాకా ప్రతీ 48 గంటలకొకసారి బందీని వైద్యుని చేత పరీక్ష చేయించాలని. కోర్టులో హాజరు పరచడానికి ముందు లాకప్పులో గడిచే నిర్బంధంతో మొదలయి, ఆ తరువాత జైలులో గానీ (కోర్టు అనుమతితో) పోలీసు కస్టడీలో గానీ గడిచే నిర్బంధానికి మొత్తంగా ఈ నియమం వర్తిస్తుంది.)

9. పైన పేర్కొన్న అన్ని డాక్యుమెంట్ల నకళ్లు స్థానిక మెజిస్ట్రేట్‌కు పంపించాలి.

(అంటే అర్థం, పైన పేర్కొన్న అరెస్టు మెమో నకలు, ఇన్‌స్పెక్షన్ మెమో నకలు, బంధించిన స్థలంలో ఉండే డైరీ నకలు, వెనువెంటనే స్థానిక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌కు పంపించాలి).

10. నిర్బంధంలో ప్రశ్నిస్తున్నంత సేపూ తన లాయర్ పక్కన ఉండాలన్న హక్కు బందీకి లేకపోయినప్పటికీ, ప్రశ్నిస్తున్న సమయంలో లాయర్‌ను సంప్రదించదలచుకుంటే ఆ అవకాశం బందీకి ఉంటుంది.

(అంటే లాకప్‌లో పోలీసులు 'ఇంటరాగేట్' చేస్తున్న సమయంలో 'నాలాయర్‌ను పిలిపించండి' అని డిమాండ్ చేసి పిలిపించుకొని సంప్రదించే హక్కు బందీకి ఉంటుంది).

11. అరెస్టు చేసిన ప్రతి పోలీస్ అధికారీ 12 గంటలలోపల ఆ సమాచారాన్ని జిల్లా పోలీసు కంట్రోల్ రూంకు, రాష్ట్ర పోలీస్ కంట్రోల్ రూంకు పంపించాలి. బందీని ఎక్కడ నిర్బంధించిందీ కూడ తెలియజేయాలి. ఈ సమాచారాన్ని పోలీస్ కంట్రోల్ రూంలో అందరికీ కనిపించే స్థలంలో నోటీస్ బోర్డ్‌లో ప్రదర్శించాలి.

(అంటే అర్థం ఏ జిల్లాలోనయినా ఎవరు అరెస్టయినా 12 గంటలలోపల ఆ సమాచారం జిల్లా పోలీస్ కంట్రోల్ రూంలోని నోటీస్ బోర్డ్‌లో ప్రత్యక్షం కావాలి. ఎక్కడ నిర్బంధించినదీ కూడ.)

ప్రస్తుతం మనదేశంలో పోలీసులు అనుసరిస్తున్న పద్ధతులకు ఈ నియమాలు చాలా భిన్నమైనవని మనకందరికీ తెలుసును. అందుకే వీటిని తెలుసుకోవటం, అమలు చేయించుకోవటం అవసరం. చిత్రహింసలను, లాకప్ హత్యలను నివారించడానికి ఇవి చాలా పనికొస్తాయి.

ఈ నియమాలను పోలీసులు ఉల్లంఘిస్తే అది కోర్టు ధిక్కారనేరం అవుతుందని అదే తీర్పులో సుప్రీం కోర్టు అనింది. మరి ఈతీర్పు వచ్చి ఒక సంవత్సరం గడిచింది. ఈ సంవత్సరకాలంలో దేశంలోని అందరు పోలీస్ అధికార్లు కోర్టు ధిక్కారనేరానికి పాల్పడుతూనే ఉన్నారు.

ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయంటే సుప్రీం కోర్టు ఆదేశం ప్రకారం ఈ తీర్పును టీవీలో ప్రచారం చేస్తున్నాయి. కరపత్రంగా అచ్చువేసి పౌరసంబంధాల శాఖ ద్వారా పంచుతున్నాయి. కానీ అదే ప్రభుత్వంలో ఒక శాఖ అయిన పోలీస్ శాఖ తనకేమీ పట్టనట్టు ఎప్పటిలాగే వ్యవహరిస్తూ ఉంది.

ఈ బూటకాన్ని మనం సాగనివ్వటానికి వీలులేదు. మన హక్కులు తెలుసుకుందాం, పోలీసు శాఖను నిలదీద్దాం, అమలు చేయించుకుందాం.

1-2-1998
విశాఖపట్నం

**ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం**
**(APCLC)**